## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జరిమానా

సుబేదారి, అక్టోబర్ 25 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో బుధవారం పట్టుబడిన ఏడుగురికి రూ.12వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జీ సీతారెడ్డి తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన మరో ముగ్గురికి రూ.1900 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

## నేడు భీమదేవరపల్లి మండలంలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం..

భీమదేవరపల్లి, అక్టోబర్ 25: మండలంలోని కొత్తకొండ, మల్లారం, రసూల్ పల్లి, వీర్లగడ్డతండా, ధర్మారం, చంటయ్యపల్లి తదితర గ్రామాల్లో నేటి రోజున బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం ఉంటుందని ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ శాసనసభ్యుడు వొడితల సతీశ్ కుమార్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, జడ్పీచైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. కొత్తకొండలోని వీరభద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం ఎన్నికల ప్రచారం ఉంటుందని వివరించారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతుబంధు నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు, రైతులు హాజరుకావాలని కోరారు.

## పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాంరెడ్డి

భీమదేవరపల్లి, అక్టోబర్ 25: ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం పరిధిలోని కాటన్‌జిన్నింగ్ మిల్లు ఆవరణలో బుధవారం పత్తికొనుగోలు కేంద్రాన్ని సొసైటీ జీఎం మారుపాటి రాంరెడ్డి ప్రారంభించారు. పత్తి తేమశాతం 8నుంచి 12వరకు ఉన్నట్లయితే వరంగల్ మార్కెట్ ధరకు లోబడి నగదు క్రింద సభ్యులకు అప్పుల క్రింద ఖరీదు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యుడు కూన కనుకయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సునీల్



నియామకపత్రం తీసుకుంటున్న సునీల్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 25 : తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమకొండ ఇందిరానగర్‌కు చెందిన కూచన సునీల్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ బీసీ ప్రజాసంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ చేతుల మీదుగా సునీల్ నియామక పత్రాన్ని అందుకున్నాడు. కూచన సునీల్ తెలంగాణ ఉద్యమకారుడిగా పోరాడారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్‌కు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదెపు నగేశ్ నేత, శివకుమార్, పవన్‌కు కూచన సునీల్ కృతజ్ఞతలు తెలిపారు.

## రైల్వే ఆలయంలో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

కాజీపేట, అక్టోబర్ 25 : కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయంలో ఈ నెల 15 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగింపులో భాగంగా 19 మంది దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం, అనంతరం అర్వపల్లి ఆంజనేయస్వామి శాస్త్రీ, లక్ష్మీనర్సింహ శాస్త్రీ, సత్యనారాయణ శర్మల మంత్రోచ్ఛరణలతో వేంకటేశ్వరస్వామి- పద్మావతి, ఆలువేలు మంగమ్మలకు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు పట్టణంతో పాటుగా చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి, ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేశారు.



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

# పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝూ**



ఎల్కతుర్తి : పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝూ

ఎల్కతుర్తి, అక్టోబర్ 25: రాబోయే సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీసు సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పొలిటికల్ ఇష్యూస్, సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లు, రౌడీషీటర్లు తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పకడ్బందీగా నిర్వహించాలని, రాత్రి వేళల్లో సైతం తనిఖీలు తప్పక చేయాలని తెలిపారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ వెంట కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై రాజు కుమార్, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

**ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి**

కమలాపూర్ : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝూ పోలీసులను ఆదేశించారు. బుధవారం 2023 సాధారణ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో సీపీగా బాధ్యతలు చేపట్టిన తొలి సారిగా కమలాపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గత హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో వివాదస్పదమైన పోలింగ్ బూత్‌లు ఎన్ని ఉన్నాయి. ఎలాంటి చర్యలు తీసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో నమోదైన కేసుల వివరాలు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరు పరిశీలించారు. వివాదస్పదమైన మండలం కావడంతో పోలీస్ ఫోర్స్ కావాలంటే పూర్తి వివరాలతో నివేదిక పంపాలని సూచించారు. పోలీసు సిబ్బంది విధులపై నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలు కావాడంతో అన్ని రాజకీయ పార్టీల పనితీరుపై దృష్టి సారించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సీఐ సంజీవ్, ఎస్సైలు కరుణాకర్, సీమాఫర్హీన్ పాల్గొన్నారు.

# కేంద్ర బలగాలతో కవాతు..



కమలాపూర్‌లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఏసీపీ డేవిడ్ రాజ్

కమలాపూర్, అక్టోబర్ 25: మండల కేంద్రంలో అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని కేంద్ర బలగాలతో కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ బుధవారం కవాతు నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు కాకుండా ఉండేందుకు పోలీస్ స్టేషన్ నుంచి పనిగట్ల వరకు కేంద్ర బలగాలతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐ సంజీవ్, ఎస్సై కరుణాకర్ తదితరులున్నారు.

నయీంనగర్: కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ క్రాస్ రోడ్ నుంచి రామారం వరకు బుధవారం భద్రతా బలగాలు కవాతు నిర్వహించాయి. ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య ఆధ్వర్యంలో ఈ కవాతు చేపట్టారు. అనంతరం అబ్బయ్య మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ కవాతును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాజ్‌కుమార్, విజయ్, అనిల్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

# షాపింగ్ మాల్ ఉద్యోగులపై పోక్సో కేసు నమోదు

సుబేదారి, అక్టోబర్ 25: హనుమకొండ నక్కలగుట్టలోని ఓ షాపింగ్ మాల్‌లో ఈ నెల 18న చీర దొంగతనం చేశారనే నెపంతో, ఓ మహిళ, ఆమె కూతురిని గదిలో బంధించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తనకు జరిగిన అవమానంపై ఈ నెల 20న సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదుపై పోలీసులు సరైన రీతిలో స్పందించక పోవడంతో, మరునాడు హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో పోలీసులపై బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై బాధితురాలు బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆందోళన చేపట్టింది. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి తనకు, తన కూతురుకు జరిగిన అన్యాయంపై వినతిపత్రం అందజేసింది. ఈ ఘటనపై సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్‌ను వివరణ కోరగా, ఈ నెల 20న రాత్రి 10.30కు ఫిర్యాదు చేయగా, మరుసటి రోజు ప్రాథమిక విచారణ జరిపి షాపింగ్ మాల్ ఉద్యోగులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా, బుధవారం బాధితురాలు, ఆమె కూతురి స్టేట్‌మెంట్లను రికార్డు చేసి షాపింగ్ మాల్ ఉద్యోగులపై పోక్సో కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కాగా, ఈ ఘటనపై పోలీసులు సకాలంలో స్పందించలేదని బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు.



అధికారులతో వాగ్వాదానికి పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలు

## ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కాంగ్రెస్ నేతల వాగ్వాదం

- ఎన్నికల అధికారుల విధులకు అడ్డుపడ్డ నాయకులు
- మల్లికుదుర్లలో కాంగ్రెస్ అభ్యర్థి ఇందిర ఎన్నికల ప్రచారంలో రసాభాసా

వేలేరు, అక్టోబర్ 25 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర తరపున ఎన్నికల ప్రచారం చేస్తున్న నేతలు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల, గుండ్లసాగర్ గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ అనే నినాదంతో ప్రచారం నిర్వహిస్తూ మహిళలకు పసుపు, కుంకుమ, గాజులతో పాటు జాకెట్(రవిక) ముక్కను కవర్‌లో పెట్టి పంపిణీ చేశారు. కాగా, ప్రచారాన్ని గమనిస్తున్న ఎన్నికల అధికారులు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది పంపిణీని అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బహుమతులు లాంటివి పంపిణీ చేయవద్దని ప్యాకెట్లను సీజ్ చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల అధికారుల వాహనానికి అడ్డుగా నిలిచి వారి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో మల్లికుదుర్లలో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కాగా, సంఘటన స్థలానికి వేలేరు ఎస్సై డీ హరిత చేరుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులను, అడ్డుతొలగించి సీజ్ చేసిన పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ప్యాకెట్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

# విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు

వేలేరు, అక్టోబర్ 25; ఎన్నికల ప్రచారంలో అనుమతి లేని వస్తువులను పంచుతూ, ఎన్నికల అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు వేలేరు ఎస్సై డీ హరిత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిరా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో బుధవారం చేపట్టిన ప్రచారంలో మహిళలకు, పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ వస్తువులను పంపిణీ చేశారు. ఎన్నికల నియమావళిని అమలులో ఉన్న సందర్భంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులైన ఎం నరేశ్ బాబు సుమారు రూ.12,859 విలువ గల వస్తువులను సీజ్ చేశారు. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సింగపురం ఇందిరా అనుచరులైన కమ్మగాని ప్రభాకర్, జోగు రాజేందర్, భట్టు పరమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు వేలేరు ఎస్సై డీ హరిత పేర్కొన్నారు.